నమస్తే తెలంగాణ
# ఆదిలాబాద్ - నిర్మల్
6 | నిజామాబాద్ మంగళవారం 3 జూన్ 2025 | ADILABAD NIRMAL

# అవతరణోత్సవం

- జెండాలను ఎగురవేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు
- ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ
- నిర్మల్‌లో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య

## ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు



ఆదిలాబాద్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్/ నిర్మల్, జూన్ 2 (నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లో సోమవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలు కనులపండువగా కొనసాగాయి. ఆదిలాబాద్ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ జాతీయ జెండాను ఎగుర వేశారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య అవతరణ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబర్చిన అధికారులకు ప్రశంసాపత్రాలు అందించారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి జోగు రామన్న తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి.. జాతీయ జెండాతోపాటు బీఆర్ఎస్ జెండాను ఎగుర వేశారు. అనంతరం అమరవీరుల స్తూపానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహం వద్ద కూడా నివాళులు అర్పించారు. కార్యకర్తలు ఉత్సాహంగా నృత్యాలు చేయగా.. వారితోపాటు రామన్న కూడా స్టెప్పులు వేశారు. బోథ్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. నార్నూర్‌లో నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో జడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ పాల్గొన్నారు. ఉట్నూర్‌లోని ఐటీడీఏలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి పీవో ఖుష్బూ గుప్తా జాతీయజెండాను ఎగురవేశారు. భైంసా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఎమ్మెల్యే రామారావు పటేల్, బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ముథోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ సమన్వయ సమితి సభ్యుడు విలాస్ గాదేవార్ జెండాలను ఎగురవేశారు. నిర్మల్ మండలంలోని కొండాపూర్‌లో గల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాంకిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగురవేసి సంబురాలు జరుపుకున్నారు.



బోథ్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్, నాయకులు



ఉట్నూర్‌లోని ఐటీడీఏలో జెండాకు వందనం చేస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, పీవో ఖుష్బూ గుప్తా

## 18 నెలల్లో 100 పథకాలు

### రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



జాతీయ జెండాను ఎగురవేస్తున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

ఆదిలాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు అవుతుందని, ఇప్పటివరకు 100 పథకాలను అమలు చేసినట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల సందర్భంగా సోమవారం ఆదిలాబాద్ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో జాతీయ జెండాను ఎగుర వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్య, వ్యవసాయ రంగాలను అభివృద్ధి చేశామని, వానకాలంలో రైతులు విత్తనాల కోసం ఇబ్బందులు పడకుండా అధికారులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఆదివాసులు సాగు చేస్తున్న పోడు భూములకు సోలార్ విద్యుత్ అందించడానికి రూ.12 వేల కోట్లతో ఇందిరా గిరిజన వికాసం పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. భూభారతి ఫథకంలో భాగంగా రెవెన్యూ సదస్సులు నిర్వహించి సమస్యలు పరిష్కరిస్తున్నామని, నాయకులు పార్టీలకు అతీతంగా అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. వివిధ శాఖల ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ పాల్గొన్నారు.



ఉద్యోగులకు ప్రశంస పత్రాలు అందజేస్తున్న సలహాదారు, ఎమ్మెల్యే, కలెక్టర్

## అభివృద్ధిలో నిర్మల్ ముందంజ

### రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య

నిర్మల్ అర్బన్, జూన్ 2 : సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో నిర్మల్ జిల్లా ముందంజలో పయనిస్తూ అందరికి ఆదర్శంగా నిలుస్తుందని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన రాష్ట్ర అవతరణ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనేక సంక్షేమ పథకాల అమలు పరుస్తూ ఉండడంతో లబ్ధిదారులు ప్రభుత్వ సహాయాన్ని పొందుతున్నారని తెలిపారు. ఏడాది పాలనలో జిల్లాలో జరిగిన ప్రగతిని వివరించారు. ప్రతిభ కనబర్చిన చిన్నారులకు కలెక్టర్ బహుమతులను అందజేశారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు విత్తన ఉత్పత్తి కోసం నాణ్యమైన విత్తనాలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య



నిర్మల్ జిల్లా భైంసా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జెండాకు వందనం చేస్తున్న విలాస్ గాదేవార్

## నిర్మల్ కలెక్టరేట్‌కే పరిమితమైన సంబురాలు

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో యేటా నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలను అధికారికంగా నిర్వహించేవారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర అవతరణ వేడుకలకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈసారి ఎన్టీఆర్ స్టేడియంలో కాకుండా కేవలం కలెక్టరేట్‌కే పరిమితం చేయడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రానికి దూరంగా ఉన్న కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ప్రజలు హాజరు కాలేకపోయారు. కేవలం అధికారులతోనే సంబురాలు జరిపారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



నిర్మల్ మండలంలోని కొండాపూర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న బీఆర్ఎస్ నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాంకిషన్‌రెడ్డి

# వడ్డీ వ్యాపారుల ఆగడాలకు అడ్డుకట్ట

- 20 పోలీసు బృందాలతో దాడులు
- 11 కేసులు నమోదు.. నిందితుల అరెస్టు..

ఆదిలాబాద్, జూన్ 2(నమస్తే తెలంగాణ) : అనుమతులు లేకుండా వడ్డీ వ్యాపారం చేస్తూ అమాయకుల నుంచి అధిక వడ్డీలు వసూలు చేస్తున్న వారి ఆగడాలకు పోలీసులు అడ్డుకట్ట వేస్తున్నారు. జిల్లాలో వ్యాప్తంగా 11 మండలాల్లో 20 బృందాలుగా ఏర్పడి వ్యాపారులపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. వీరి వద్ద నుంచి ప్రామిసరీ నోట్లు, స్టాంపు పేపర్లు, చెక్కులు, భూములకు చెందిన డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. జిల్లాలో వడ్డీ వ్యాపారం విచ్చలవిడిగా కొనసాగుతుంది. కొందరు అమాయక ప్రజల అవసరాలను ఆసరా చేసుకుని అధిక వడ్డీలు వసూలు చేస్తున్నారు. వడ్డీ డబ్బులు ఇవ్వడానికి భూమిని తమ పేర్లపై సెల్‌డీడ్‌లు చేసుకుంటున్నారు. అప్పులు తీసుకున్న వారు అధికవడ్డీలతోపాటు అసలు కట్టలేక విసిగి వేసారి చివరకు తమ ఆస్తులను అప్పు ఇచ్చిన వ్యక్తికి ఇచ్చి వేస్తున్నారు. దీంతో వడ్డీ వ్యాపారులకు వడ్డీల పేరిట తక్కువ డబ్బులతో విలువైన ఆస్తులను సంపాదిస్తున్నారు.



రాంపూర్‌లో వడ్డీ వ్యాపారి ఇంట్లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

### 11 కేసులు నమోదు

ఆదిలాబాద్ వన్ టౌన్, టూ టౌన్, రూరల్, మావల, బోథ్, భీంపూర్, తాంసి, బేల, ఉట్నూర్, గుడిహత్నూర్, ఇంద్రవెల్లి మండలాల పరిధిలోని వ్యాపారుల ఇండ్లతో దాడులు నిర్వహించి పోలీసులు సెక్షన్ 3(5)(బీ) తెలంగాణ ఏరియా మనీ లాండర్స్ యాక్ట్ 1349 కింద కేసులు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఆదేమల్ల నారాయణ రెడ్డి వడ్డీ చెల్లించలేదని కారణంగా తన ఇల్లును సెల్‌డీడ్ రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నారాయణ రెడ్డిపై కేసు నమోదు చేశామన్నారు. పట్టణంలోని మోహన్ అనే వ్యక్తి ఇంట్లో తనిఖీలు నిర్వహించి పలు పత్రాలు స్వాధీనం చేసుకున్నామని, రవీంద్రనగర్ చెందిన ఉత్తూర్వార్ ఆనంద్ ఇళ్లు, దుకాణాన్ని తనిఖీ చేసి చెక్కులు, ప్రామిసరీ నోట్లు, బాండ్ పేపర్లు స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. స్థలాన్ని సెల్‌డీడ్ చేయించుకున్న నార్లావర్ రాధికపై కేసు పెట్టానట్లు డీఎస్పీ తెలిపారు. వీరితోపాటు టూటౌన్ పరిధిలోని వరలక్ష్మీ నగర్‌కు చెందిన మారాటే హేమంత్ కుమార్, మావల పోలీస్ స్టేషన్‌లో ఎంప్లాయీస్ కాలనీకి చెందిన ఏనుగు లక్ష్మారెడ్డి, టీచర్స్ కాలనీకి చెందిన గోపిడి నవీన్‌రెడ్డి, రూరల్ పోలీస్ స్టేషన్‌లో రాంపూర్‌కు చెందిన అన్నం ప్రభాకర్, భీంసరికి చెందిన గౌరు రమేశ్, తాంసి పోలీస్ స్టేషన్‌లో కప్పర్లకు చెందిన గంద్రత్ అశోక్, భీంపూర్ పోలీస్ స్టేషన్‌లో నిపానికి చెందిన జిట్ట సుదర్శన్ రెడ్డిలపై కేసులు నమోదు చేశారు.

### అక్రమ వ్యాపారం చేసే వారిపై కఠిన చర్యలు



రైతులు, అమాయక ప్రజల అవసరాలను ఆసరగా చేసుకుని అప్పులు ఇస్తూ అధిక వడ్డీలు వసూలు చేస్తూ అక్రమవ్యాపారానికి పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. జిల్లా వ్యాప్తంగా దాడులు నిర్వహించి వడ్డీ వ్యాపారుల వద్ద నుంచి ప్రామిసరీ నోట్లు, బ్యాంకుల చెక్కుపుస్తకాలు, రిజిస్టర్‌లు, స్థలాల ఇండ్ల డాక్యుమెంట్లు, స్వాధీనం చేసుకుని 11 కేసులు నమోదు చేసి పలువురిని అరెస్ట్ చేశాం. లైసెన్స్‌లు లేకుండా వడ్డీ వ్యాపారం నిర్వహించరాదు.

- జీవన్‌రెడ్డి, డీఎస్పీ, ఆదిలాబాద్



ఫిర్యాదుదారుతో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

## ఫిర్యాదుల స్వీకరణ

ఎదులాపురం, జూన్ 2 : బాధితులకు సత్వర న్యాయం అందినప్పుడే పోలీసు వ్యవస్థపై నమ్మకం పెరుగుతుందని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ ముఖ్య కార్యాలయంలో సమస్యల పరిష్కారానికి సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. 15 ఫిర్యాదులు స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధింత పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సీసీ కొండ రాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారి జైస్వాల్ కవిత, సిబ్బంది పాల్గొన్నారు.

## నేటి నుంచి పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

ఎదులాపురం, జూన్ 2 : ఈనెల 3(మంగళవారం) నుంచి పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు డీఈవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఫస్ట్ లాంగ్వేజ్‌కు 100 మంది, సెకండ్ లాంగ్వేజ్ 25 మంది, థర్డ్ లాంగ్వేజ్ 70 మంది, మ్యాథ్స్ 115 మంది, సైన్స్ 147 మంది, సోషల్ 45 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. పరీక్ష కేంద్రంలో అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

## ఆరు గ్రాముల బంగారు నగలు..

### 36 తులాల వెండి చోరీ

ఎదులాపురం, జూన్ 2 : ఆదిలాబాద్ పట్టణంలోని పంజేషా కాలనీలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ ఘటన వెలుగు చూసింది. ఆ కాలనీలో నివాసం ఉండే నరేందర్ గత నెల 29న కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లాడు. సోమవారం ఉదయం వచ్చి చూడగా ఇంటి తాళం పగలగొట్టి ఉంది. ఇంట్లోని బీరువా తెరచి ఉండి అందులో ఉండాల్సిన ఆరు గ్రాముల బంగారం నగలు, 36 తులాల వెండి విగ్రహాలు కనిపించలేదు. దీంతో బాధితుడు ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ బి.సునీల్ కుమార్ తెలిపారు.



కళాజాత పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల

## పోస్టర్ల ఆవిష్కరణ

నిర్మల్ అర్బన్, జూన్ 2 : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల జిల్లాను మత్తు రహిత జిల్లాగా నిలిపేందుకు ముందుకొచ్చారు. ఇందుకు సంబంధించిన కళాజాత బృందంతో సోమవారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు డ్రగ్ ఫ్రీ జిల్లాగా తీర్చిదిద్దేందుకు పోలీస్ శాఖ చర్యలు చేపట్టిందని, మత్తు పదర్థాలను విక్రయించినా, సేవించినా 8712659599 ఫోన్ నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. విక్రయించినా, సాగు చేసినా, దిగుమతి చేసిన వారిపై పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## ఆర్థిక పరమైన పనులు చేయం

### పంచాయతీ కార్యదర్శుల జేఏసీ సంఘం వినతి

బజార్‌హత్నూర్, జూన్ 2 : మండలంలోని గ్రామ పంచాయతీలలో ఆర్థిక పరమైన పనులు చేయమని కార్యదర్శులు సోమవారం ఎంపీడీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శుల జేఏసీ సంఘం మండల అధ్యక్షుడు గంగాసాగర్ మాట్లాడుతూ.. పంచాయతీలో ట్రాక్టర్ ద్వారా చెత్తసేకరణ, మోటార్ రిపేరింగ్, వీధిదీపాల ఏర్పాటు, గడ్డిమందులు కొనడం వంటి పనులు చేయమని ఎంపీడీవోకు వినతిపత్రం అందించారు. ఆగస్టు 2024 నుంచి ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న చెక్‌లు క్లియర్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మహేందర్‌రెడ్డి, కార్యదర్శులు శ్రీనివాస్, శంకర్, ప్రదీప్, నవనీత, షబానా పాల్గొన్నారు.



బజార్‌హత్నూర్ ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు